ప్రజాసేవే శాశ్వతం

లింగాల: పదవులు కాదు ప్రజాసేవే శాశ్వతం అని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదవి ముగిసినా ప్రజసేవలోనే ఉండాలని సూచించారు. మండలంలోని జెడ్పీటీసీ నేజమ్మ, ఎంపీపీ లింగమ్మ, మరో 9 మంది ఎంపీటీసీలను, కోఆప్షన్ సభ్యుడిని ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు, అధికారులు ఘనంగా సన్మానించి వారికి వీడ్కోలు పలికారు. అంతకు ముందు మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బంది కోసం నిర్మించిన క్వాటర్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, రంగినేని శ్రీనివాసరావు, నాగేశ్వర్‌రావు, హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రాథోడ్, మల్లయ్య, ఉల్లంగొండ రాజు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చారకొండ: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ప్రజాప్రతినిధులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మండల అభివృద్ధిలో జెడ్పీటీసీ, ఎంపీటీసీల పాత్ర మరిచిపోలేమన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్, వైస్ ఎంపీపీ బక్కమ్మ యాదవ్, కోఆప్షన్ సభ్యులు సలీం, ఎంపీటీసీలు లక్ష్మణ్, లలిత, లక్ష్మణ్‌లను సన్మానించి వీడ్కోలు పలికారు. సింగిల్‌విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, అధికారులు తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, ఏఓ చిన్న హుస్సేన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, మాజీ జెడ్పీటీసీ వెంకట్ గౌడ్, వెంకటయ్య యాదవ్, ఆయా గ్రామాల అధికారులు, తదితరులు ఉన్నారు.


లింగాల ఆత్మీయ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

బల్మూర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అరుణతో పాటు మండలంలోని ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యుడిని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సత్కరించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ నర్సయ్య, ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ శైలేష్‌కుమార్, వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీపతిరావు, నాయకులు నర్సింగ్‌రావు, చంద్రమోహన్, ఖదీర్, వెంకటేశ్వర్‌రెడ్డి, సంపింగి రమేష్, పాల్గొన్నారు.

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయ, వైస్ ఎంపీపీ శాంతిలను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ సునీత, సీనియర్ అసిస్టెంట్ రేవంత్‌రెడ్డి, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ లక్ష్మీదేవి ఎంపీటీసీ, జెడ్పీటీసీలను సన్మానించారు. ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతుగా కృషి చేశానన్నారు. ఆయా గ్రామాల ఎంపీటీసీలకు అధికారులు సన్మానం చేసి సత్కరించారు.

పెంట్లవెల్లి: పల్లెల ప్రగతి కోసం ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేయాలని ఎంపీడీఓ ప్రసన్న కుమారి అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమామహేశ్వరి, జెడ్పీటీసీ చిట్టెమ్మ, ఎంపీటీసీలు సుమలత, శేషు, వెంకటేశ్వర్లు, ఈశ్వర కుమారి పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: పదవి లేకున్నా ప్రజాసేవలోనే ఉంటామని ఎంపీపీ మనోహర, వైస్ ఎంపీపీ గోవర్ధన్, ఎంపీటీసీలు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మనోహర అధ్యక్షతన ప్రజాప్రతినిధులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీలను ఎంపీడీఓ వెంకట్రాములు సత్కరించారు. తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపీఓ దేవేందర్, వివిధ గ్రామాల కార్యదర్శులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.


పెంట్లవెల్లిలో..


వెల్దండలో ..


కల్వకుర్తిలో ప్రజాప్రతినిధులకు సన్మానించిన అధికారులు

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

తెలకపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పోలీసు స్టేషన్ ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కనకయ్యగౌడ్ ఉన్నారు.


రికార్డు పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్

విద్యార్థులను వేధిస్తే కఠిన చర్యలు

తెలకపల్లి: విద్యార్థులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని అడిషనల్ ఎస్పీ సీహెచ్ రామేశ్వర్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల బాలికల వేధింపులపై షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఫోక్సో చట్టాలు, ఆన్‌లైన్ మోసాలు, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైన బాలికలను, మహిళలను వేధిస్తే సెల్: 8712657676 లేదా 100 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలన్నారు. బాధితుల పేర్లు, ఫోన్ నంబర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేష్, షీటీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి, వెంకటయ్య, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ శ్రీలత, పద్మావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రామేశ్వర్

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రెండు రోజుల కిందట వనపట్లలో మట్టిమిద్దె కూలి నలుగురు చనిపోవడం దురదృష్టకరం అని బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గ్రామానికి వెళ్లి కూలిన మిద్దెను పరిశీలించి కుటుంబాన్ని పరామర్శించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబానికి ప్రభుత్వం ప్రత్యేక ఎక్స్‌గ్రేసియా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అదే విధంగా బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని, డబుల్‌బెడ్రూం ఇల్లు ఇవ్వాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజు, అసెంబ్లీ కార్యదర్శి కల్యాణ్, మండల అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు నాగేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

ఇసుక టిప్పర్ పట్టివేత: కేసు నమోదు

తెలకపల్లి: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం తాళ్లపల్లి, నడిగడ్డ గ్రామాల మధ్య ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను బ్లూకోర్టు పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. టిప్పర్ డ్రైవర్ మంతటి కురుమయ్య, ఓనర్ చంద్రశేఖర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లక్ష్మాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కురుమూర్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా



నాగర్‌కర్నూల్‌రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ. 6వేలు పింఛన్ ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్ల గౌతం, కార్యదర్శి పుల్జాల బాలీశ్వర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడంతో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో లింగంగౌడ్, ఆంజనేయులు, వెంకటయ్య, మహేష్, శ్రీకాంత్, ఆనంద్, బంగారయ్య, అలివేలు తదితరులు ఉన్నారు.

మండపం ఏర్పాటుకు చర్యలు

కొల్లాపూర్: పట్టణంలోని వరిదేల శమీవృక్షం వద్ద మండపం నిర్మాణానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య నాగరాజు, ఏఈ సాయిరాంలు మండపం నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. కౌన్సిలర్లు మేకల శిరీషకిరణ్ యాదవ్, రహీంపాషా, రాంచందర్‌రావు, సురేందర్‌సింగ్, కిషోర్‌యాదవ్ ఉన్నారు.

క్లుప్తంగా

దాతకు సన్మానం

అచ్చంపేట రూరల్: మండలంలోని బొమ్మన్‌పల్లి పాఠశాలలో 160 మంది విద్యార్థులకు రూ. 30వేల వ్యయంతో ఉచితంగా నోట్‌బుక్స్, బ్యాగులు అందించిన దాత ధర్మానాయక్‌ను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోతీరాం, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు సువర్ణ, చందర్‌నాయక్, సాయిబాబా నరసింహ, ఉపాధ్యాయులు జ్యోతిలాల్, బిక్కు నాయక్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



పెద్దకొత్తపల్లి: రైతు భరోసాపై ప్రభుత్వం రైతుల అభిప్రాయాలు సేకరిస్తుందని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని సింగిల్‌విండోలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో డీపీఓ రఘునందన్‌రావు, జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ మెరుగు రాజు, ఎంపీటీసీ రవికుమార్, సింగిల్‌విండో డైరెక్టర్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, దుండు చంద్రయ్య, ఏఓ శ్రీరాం, సింగిల్‌విండో సీఈఓ సిరాజ్ పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిగా ఖాజా నిజాంఅలీ

వెల్దండ: మండల ప్రత్యేక అధికారి ఖాజా నిజాంఅలీని జిల్లా అధికారులు నియమించినట్లు ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పదవీ కాలం ముగియడంతో జిల్లా అధికారులు ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా ఉన్న ఖాజా నిజాంఅలీకి మండల బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలపై ఫిర్యాదు



బిజినేపల్లి: మండల కేంద్రంలోని ఒక ప్రైవేటు పాఠశాలకు ప్రిన్సిపాల్‌ను ఏర్పాటు చేయకుండా నిర్వహిస్తునట్లు మండలానికి చెందిన బీఎస్పీ నాయకులు ఎంఈఓ భాస్కర్‌రెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. పీఈటీలే బస్సు డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. జిల్లా నాయకులు పృథ్వీరాజ్, కల్యాణ్, పరశురామ్, రాంచందర్, శివ, రాజు తదితరులు ఉన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని వినతి



ఊర్కొండ: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని బుధవారం తహసీల్దార్ చెన్నకిష్టప్పకు బీజేవైఎం మండల అధ్యక్షుడు గణేష్ ముదిరాజ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కూడా నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందని వివరించారు. ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలం అయ్యిందని పేర్కొన్నారు. కార్యక్రమం నాయకులు రాజేందర్ గౌడ్, బ్రహ్మాచారి, సందీప్‌కుమార్, కొమ్ము శీను, బండి మల్లేష్, రాము, మహేష్, విజేందర్ రాజు, బీజేవైఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



తాడూరు: మండల కేంద్రంలో ఎస్‌ఐ మహేష్ ఆధ్వర్యంలో బుధవారం వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. రోడ్డు నియమ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం వాహనాలు నడిపించొద్దని సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత సంచారంలో వాస్తవం లేదు

కొల్లాపూర్: పెంట్లవెల్లి మండలం ఎంగంపల్లి తండా సమీపంలోని చెన్నంపల్లి శివారు ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లుగా చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజర్ శరత్‌చంద్రారెడ్డి వెల్లడించారు. తండా పరిసరాల్లో చిరుతకి సంభందించిన పాదముద్రల గుర్తులు ఉన్నాయని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో ఫారెస్టు అధికారులు గుర్తులను పరిశీలించారు. అవి చిరుతవి కావని, కుక్కజాతికి చెందిన జంతువు పాదముద్రలని నిర్ధారించారు.

పాలకులు పాలనపై దృష్టి పెట్టాలి

తాడూరు: రాజకీయాలు పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని శిర్సవాడ, తాడూరులో ఎంజేఆర్ ట్రస్ట్ ద్వార నిర్మించిన పాఠశాల భవనాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజేఆర్ ట్రస్ట్ మర్రిరిటేల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించిన పాఠశాలలపై తమ ట్రస్ట్ కంపెనీ పేర్లను తొలగించడం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలతోనే ఆయా పాఠశాలలపై ఉన్న పేర్లను తొలగించారని ఆరోపించారు. ప్రజలు అధికారాన్ని ఇచ్చింది ప్రజలకు మంచి చేయడానికే కాని ప్రజలను రెచ్చగొట్టి రాజకీయం చేయడం తగదన్నారు. గోడలపైన పేర్లు తొలగించిన మాత్రనా ప్రజల గుండెల్లో చెరపలేరన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఎండీ సమ్మద్‌పాషా, రాములు, మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అనీల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగయ్య, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ భవనాలపై ఎమ్మెల్సీ పేరు రాయించుకున్న కార్డులను చూపిస్తున్న మర్రిజనార్దన్‌రెడ్డి

యాగ స్థలం పరిశీలన

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహించనున్న ఆయుత చండీ అతిరుద్ర యాగం స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామీజి నుంచి ఆశీస్సులు పొందారు. యాగ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.

భూ కబ్జాలకు పాల్పడితే చర్యలు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని 9, 10వ వార్డులలో రోడ్డును ఆక్రమించుకొని నిర్మించుకున్న కట్టడాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఆయా వార్డుల్లోని ప్రజలు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకుని ఆక్రమణలను తొలగించారు. కొందరు అభ్యంతరాలు చెప్పినా అధికారులు వినిపించుకోలేదు. నిబంధనలకు కట్టుబడి యజమానులు నిర్మాణాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, రోడ్ల స్థలాలను కబ్జాలకు గురి చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాంపును తొలగిస్తున్న కమిషనర్

స్వయంశక్తితో ఎదగాలి

కొల్లాపూర్: యువత స్వయంశక్తితో ఎదగాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ నియోజకవర్గంలోని 20 మంది యువతులకు హైదరాబాద్‌లో డ్రోన్ పైలెట్ శిక్షణ ఇప్పించారు. బుధవారంతో శిక్షణ పూర్తికావడంతో రవీంద్రభారతిలో డ్రోన్ లైసెన్స్, గుర్తింపు పత్రాలను మంత్రి అందజేశారు. శిక్షణ పొందిన యువతులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, అడ్వైజర్ జిల్లెల సతీష్, డ్రోన్ ట్రైనర్‌లు విజయ్‌కుమార్, శ్రీనాథ్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కల్వకుర్తి టౌన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్‌క్రైమ్ డీఎస్పీ గిరికుమార్ కోరారు. బుధవారం పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో సైబర్ జాగృతి దివాస్ సందర్భంగా కళాశాలలోని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలు, వ్యక్తిగత సమాచారం గుర్తుతెలియని వ్యక్తులకు చెప్పొద్దన్నారు. సైబర్‌నేరగాళ్ల బారిన పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కల్వకుర్తి సీఐ నాగార్జున మాట్లాడుతూ ర్యాష్ డ్రైవింగ్, మద్యం మత్తులో వాహనాలు నడపటం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వివరించారు.

ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు

కొల్లాపూర్: మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ మేకల రమ్యానాగరాజు వెల్లడించారు. పట్టణంలోని పలు వార్డుల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా, సమస్యలపై మున్సిపల్ సిబ్బంది సర్వే చేపట్టారు. స్థానిక కౌన్సిలర్లు సర్వేను పర్యవేక్షించారు. నీరు వృథా పోకుండా తగిన జాగ్రత్తలు పాటించేలా ప్రజలను చైతన్యం చేయాలని కౌన్సిలర్లకు సూచించారు. కౌన్సిలర్లు రహీంపాషా, నయూమ్, బోరెల్లి కరుణమహేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాల్లో మెరుగైన వైద్యం

బల్మూర్: పల్లె దవాఖానలలో మెరుగైన వైద్యం అందుతుందని ఎమ్మెలే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని కొండనాగులలో ఎన్‌హెచ్‌ఎం నిధులు రూ.16 లక్షలతో ఐటీడీఏ వారు నిర్మించిన పల్లె దవాఖాన భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ అరుణ, వైస్ ఎంపీపీ నారాయణ, విండో చైర్మన్ నర్సయ్య, ఎంపీడీఓ భాస్కర్, వైద్యాధికారి తారాసింగ్, వెంకట్‌రెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వర్తించే వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలు, రోగులకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండలంలోని చందాపూర్, ఐనోల్, బొమ్మన్‌పల్లిలో పల్లె దవాఖానాలను ఆయన ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్, జెడ్పీటీసీ మంత్రియానాయక్, వైస్ ఎంపీపీ అమరావతి, సీఎం రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఐకి ఘన వీడ్కోలు

అచ్చంపేట రూరల్: పట్టణ రెండో ఎస్‌ఐగా విధులు నిర్వర్తించి మహబూబ్‌నగర్ వీఆర్‌కు బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ శివయ్యను బుధవారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవీందర్ ఘనంగా సన్మానించారు. ఎస్‌ఐ సేవలను కొనియాడారు. ఎస్‌ఐ రాములు, సిబ్బంది అనీల్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

పచ్చ జొన్న పంటలను కాపాడుకుందాం

మన్ననూర్: పచ్చ జొన్న పంటలను కాపాడుకుందామని ఏఈఓ సీతారాం అన్నారు. బుధవారం మన్ననూర్‌లోని రైతులు సాగు చేస్తున్న జొన్న పంటలను ఆయన పరిశీలించారు. పచ్చ జొన్న పంటకు కత్తెర పురుగు తెగుళ్లు ఆశిస్తున్నాయని పేర్కొన్నారు. తెగులు నివారణకు స్పైనోసాడ్ లేదా క్లోరాంతనిలిప్రోలు మందును 0.3 గ్రాములు లీటరు నీరుతో కలిపి ఉదయం లేదా సాయింత్రం పిచికారి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పత్తి పంటలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు జితేందర్, తిరుపతి, చంద్రు మహిళా రైతులు పాల్గొన్నారు.

‘చిల్లర రాజకీయాలు మానుకో’

తాడూరు: నియోజకవర్గంలో చిల్లర రాజకీయాలు చేస్తున్నది మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డియేనని జెడ్పీటీసీ రోహిణి, సింగిల్‌విండో అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, నాయకులు మల్లయ్య, రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎలాంటి మచ్చలేని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి కుటుంబంపై అసత్య ప్రచారాలు చేస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పాఠశాలల గోడలపై మర్రి అన్న చారిటీ అని పెట్టుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. సమావేశంలో నాయకులు శ్రీధర్‌గౌడ్, కృష్ణారెడ్డి, వెంకటయ్య, మల్లేష్, చంద్రయ్య, నిరంజన్, బుచ్చయ్య, కోటీశ్వర్, పర్వతాలు ఉన్నారు.

పూర్వప్రాథమిక విద్యను బలోపేతం చేద్దాం



అమ్రాబాద్: పూర్వప్రాథమిక విద్యను బలోపేతానికి అందరు కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి కోరారు. మండలంలోని కుమ్మరోనిపల్లి రైతువేదికలో అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం సీడీపీఓ ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీకి వచ్చే చిన్నారులకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విధానంతో ప్రీప్రైమరీ స్కూల్ విద్యను అందించాలని సూచించారు. శిక్షణను అంగన్‌వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో వెంకటరమణమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు ప్రియదర్శిని కరదీపిక ద్వారా పూర్వ బాల్య సమగ్ర అభివృద్ధి అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి సిబ్బంది వరలక్ష్మి,శిరిష, డి.లక్ష్మి, స్వాతి, పద్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాచారం

విద్యాసంస్థల బంద్

నాగర్‌కర్నూల్‌రూరల్: నీట్‌లో జరిగిన అవకతవకలను నిరసిస్తూ గురువారం విద్యాసంస్థల బంద్ పాటిస్తునట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుగౌడ్, ప్రేమ్‌కుమార్‌లు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని కోరారు. పరీక్షల నిర్వహణ రాష్ట్రాలకు అప్పగించాలని తెలిపారు.

కొల్లాపూర్: నీట్ పరీక్షల నిర్వహణ లోపాలను నిరసిస్తూ విద్యాసంస్థల బంద్ చేపట్టనున్నట్లు ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రేమ్‌కుమార్, తారాసింగ్‌లు బుధవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట రూరల్: కల్వకుర్తి నుంచి అచ్చంపేటకు సరఫరా అయ్యే 132 కేవీ విద్యుత్ లైను మరమ్మతు కారణంగా గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ కామేశ్వర్‌రావు, ఏఈ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న నియోజకవర్గంలోని అచ్చంపేట, లింగాల, బల్మూర్, ఉప్పునుంతల, అమ్రాబాద్, పదర మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు.

ప్రజా ప్రతినిధులకు వీడ్కోలు

ఉప్పునుంతల: మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగియనుండటంతో గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక కార్యాలయంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాలచందర్ సుజన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు మహజన సభ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో గురువారం అత్యవసర రైతు మహజన సభ నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కార్యక్రమం ఉంటుందని కల్వకుర్తి, ఊర్కొండ మండలాల పరిధిలోని రైతులు సమావేశానికి హాజరై అభిప్రాయాలు తెలపాలని కోరారు.